క్లుప్తంగా

వెంటనే చెల్లించండి.. రాయితీని పొందండి

అమలాపురం టౌన్: మున్సిపాలిటీల్లో 2024–25 సంవత్సరానికి సంబంధించి ముందస్తు పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ ఇస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసిందని అమలాపురం మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ తెలిపారు. ఈనెల 30వ తేదీలోపు మొత్తం పన్ను ఒకేసారి చెల్లించిన వారికి 5 శాతం పన్ను రాయితీ అమలవుతుందని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పన్ను చెల్లింపుదారులు మున్సిపల్ కార్యాలయం లేదా పట్టణంలోని 15 వార్డు సచివాలయాల ద్వారా చెల్లించి రాయితీ పొందాలని సూచించారు. ఆన్‌లైన్‌లో కూడా పన్ను చెల్లించే వెసులబాటు ఉందన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

అమలాపురం టౌన్: ఓటు హక్కును ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు గురి కాకుండా స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్(డీఐఈవో) వనుము సోమశేఖరరావు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాల నుంచి ఓటు హక్కు వినియోగంపై సోమవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కవల కోటిలింగంతోపాటు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా


ఐ.పోలవరంలో రాజీనామా చేసిన వలంటీర్లు

ఐ.పోలవరం: సంక్షేమ సారథులుగా ప్రజలు మన్ననలు అందుకుంటున్న వలంటీర్లపై ప్రతిపక్ష పార్టీలు అవలంబిస్తున్న నిరంకుశ వైఖరిని నిరసిస్తూ ఐ.పోలవరం గ్రామ సచివాలయ పరిధిలోని 40 మంది గ్రామ వలంటీర్లు సోమవారం మూకుమ్మడి రాజీనామా చేశారు. ఈసందర్భంగా ఐ.పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను మండల పరిషత్ సిబ్బందికి అందజేశారు. వలంటీర్లు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పేదల ఇంటికి చేర్చామన్నారు. కరోనా సమయంలో మా ప్రాణాలకు తెగించి సేవలు చేశామన్నారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి తమ వంతుగా పని చేస్తామని, అందుకే రాజీనామా చేశామన్నారు.

'ఉగాది' అవార్డుకు నాని ఎంపిక



తాళ్లరేవు: విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ప్రతి సంవత్సరం అందిస్తున్న ఉగాది పురస్కారానికి తాళ్లరేవు పంచాయతీ శ్రీరంగ నాయకపురం గ్రామానికి చెందిన ఆస్ట్రాలజిస్టు వెదురుపావులూరి తాతాజీ(నాని) ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ నుంచి సమాచారం అందినట్టు నాని సోమవారం తెలిపారు. ఈ నెల 14వ తేదీ ఆదివారం హైదరాబాద్‌లోని బేగంపేట టూరిజం ప్లాజాలో నిర్వహించనున్న విశ్వగురు ఉగాది పురస్కారాలు–2024 కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాలకు చెందిన వారికి ఉగాది పురస్కారాలు అందజేయనున్నారు. దీనిలో భాగంగా ఆస్ట్రాలజీ విభాగంలో తనను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు నాని తెలిపారు.

జాబ్‌మేళాకు 47 మంది ఎంపిక

యానాం: యానాం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో సోమవారం ప్రముఖ ఎల్‌అండ్‌టీ సంస్థ నిర్వహించిన జాబ్‌మేళాలో 47 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణ సుధాకర్ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎల్‌అండ్‌టీ కంపెనీ ప్రతినిధులు డి.కాంతరావు, శ్రీరాజ్‌కుమార్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు 59 మంది హాజరుకాగా 47 మందికి ఎంపికై య్యారు. వారికి ఉద్యోగ నియామక పత్రాలను అందించారన్నారు. ఎంపికైన వారికి చెన్నై వద్ద కాంచీపురంలో ఉచిత భోజనం, వసతి ఇచ్చి 3 నెలల పాటు శిక్షణానంతరం ఏపీ, తెలంగాణాల్లో రూ.18వేల జీతంతో ఎల్‌అండ్‌టీ సైట్‌ల్లోకి ఉద్యోగాల్లో తీసుకుంటారన్నారు.

బాలికల ఉచిత బస్సు ప్రకటన మరిచారు

యానాం: బాలికల కోసం ఉచిత బస్సు ప్రయాణం ప్రకటనను బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం ఏమి చేసిందని కాంగ్రెస్ అభ్యర్థి, సిటింగ్ ఎంపీ వైథిలింగం ప్రశ్నించారు. సోమవారం ఆయన ఉసుడు అసెంబ్లీ నియోజకవర్గంలో మాజీ సీఎం నారాయణసామితో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌షాపులను తిరిగి ప్రారంభిస్తామని, అదేవిధంగా ఉచిత బియ్యం ఇస్తామని సీఎం రంగసామి చేసిన ప్రకటనలు ఏమయ్యాయన్నారు. ఇప్పటికే రాహుల్‌గాంధీ ప్రకటించిన ఒక ఏడాదిలో ఒక లక్ష పథకం గురించి వివరించారు. దేశవ్యాప్తంగా రెండు నెలల్లో 30 లక్షల ఉద్యోగాల భర్తీ, 50 శాతం కోటా మహిళలకు అమలు తదితర అంశాలపై కాంగ్రెస్‌కు మద్దతునివ్వాలని కోరారు.

వడదెబ్బ.. ఉపశమనం ఇలా

- ఎండలతో ఇబ్బంది పడుతున్న జనం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



అమలాపురం టౌన్: ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఎండలతోపాటు వేడి గాలులు వీస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వడదెబ్బకు గురవుతున్నారు. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తమ వద్దకు వచ్చే రోగులకు వడ దెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. మనం తీసుకునే జాగ్రత్తల వల్ల వడదెబ్బ వల్లే అప్పుడప్పుడు ఎదురయ్యే మరణాలను అవగాహనతో అడ్డుకోవచ్చని సూచిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు
- చెమటలు పట్టకపోవడం
- శరీర ఉష్ణోగ్రత పెరడడం
- వణుకు పుట్టడం
- మగత నిద్ర లేదా కలవరింతలు
- ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితి

చేయాల్సినవి
- నీరు, పళ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి
- నలుపు రంగు, మందంగా ఉండే దుస్తులు వేసుకోకూడదు. వాటికి బదులు లేత రంగుల్లో లభించే తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి
- రోజూ కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలి
- ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తీసుకోవాలి
- పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి
- ఎండ వేళ ఇంటి పట్టునే ఉండాలి. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు లేదా టోపీ వంటివి విధగా వాడాలి
- ఇంట్లో కిటికీలు తెరిచి ఉంచాలి

చేయకూడనివి
- తీవ్ర ఉష్ణోగ్రతలు ఉండే సమయంలో బయట ఎక్కువగా తిరగకూడదు.
- రోడ్ల చెంత విక్రయించే చల్లని రంగు పానీయాలు తాగకూడదు.
- రోడ్ల చెంత అమ్మే కలుషిత ఆహారాన్ని తినకూడదు.
- మాంసాహారం తగ్గించాలి. తాజా కూరగాయలు, ఆకు కూరలను ఆహారంగా తీసుకోవాలి.
- మద్యం సేవించకూడదు

ప్రథమ చికిత్స ఇలా

వడదెబ్బ తగిలిన వ్యక్తిని తక్షణమే నీడ ఉండే ప్రదేశానికి తీసుకుని వెళ్లాలి. చల్లటి నీటిలో ముంచిన తడి వస్త్రంతో శరీరం అంతా తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకూ అలానే చేయాలి. ఫ్యాను గాలి లేదా చల్లని గాలి తగిలేలా ఉంచాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం లేదా ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణం (ఓఆర్ఎస్) తాగించాలి. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు ఎండా మరింత అప్రమత్తంగా ఉండి శ్రద్ధ తీసుకోవాలి. వడదెబ్బ తగిలి అపస్మారక పరిస్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదు. వీలైనంత తొందరగా దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తరలించాలి

అందరూ అప్రమత్తంగా ఉండాలి



వేసవిలో మండే ఎండలపై ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బను తేలికగా తీసుకోకుండా, అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా మిట్ట మధ్యాహ్నం ఎండల్లో అత్యసరమైతే తప్పా సాధ్యమైనంత వరకూ బయటకు వెళ్లకుండా ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటే మంచింది. చల్లటి పల్చటి మజ్జిగతోపాటు తరచూ ద్రవ రూపంలో ఉన్న పదార్థులు, పండ్ల రసాలు తీసుకోవాలి. బయటకు వెళితే తెల్లటి క్లాత్ మోఖానికి ధరించాలి. వడదెబ్బ అనివార్యమై ప్రాథమిక సపర్యలతోపాటు సమీపంలో ఆస్పత్రికి వెళ్లి వైద్యుడి సలహా కూడా తీసుకోవాలి.

– డాక్టర్ కె.శంకరరావు, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, అమలాపురం

కేవీపీఎస్ బలోపేతానికి కృషి

తాళ్లరేవు: కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి బలోపేతానికి కృషి చేయనున్నట్లు సంఘ గౌరవాధ్యక్షుడు, విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు తెలిపారు. సోమవారం స్థానిక ప్రజా సంఘాల భవనంలో సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ కేవీపీఎస్ రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ చాల నిబద్ధతతో దళితుల సమస్యలపై పని చేస్తుందని, అటువంటి సంఘాన్ని తాళ్లరేవు మండలంలో బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 11వ తేదీన సంఘ భవనంలో జ్యోతిరావుపూలే జయంతిని నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి అమ్మవారి జాతర, తీర్థం

ముమ్మిడివరం: కోరిన కోర్కెలు తీర్చే కొండాలమ్మ అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. మంగళవారం నుంచి 16వ తేదీ వరకు జాతర మహోత్సవాలు జరుగుతాయి. వివిధ రూపాలలో దర్శనమిచ్చే అమ్మవారికి పూజలు, గరగ నృత్యాలతో జాతర మహోత్సవాలు జరుగుతాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొవాలని కోరారు.

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనే రావాలి


చల్లపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి విశ్వరూప్

- ఎన్నికల ప్రచారంలో పినిపే విశ్వరూప్
- గ్రామాల్లో ఘన స్వాగతం

ఉప్పలగుప్తం: ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనే ముఖ్యమంత్రిగా రావాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం నియోజకవర్గ అభ్యర్థి పినిపే విశ్వరూప్ అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి అధ్యక్షతన చల్లపల్లి గ్రామంలో సోమవారం ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో కలసి మంత్రి విశ్వరూప్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఉన్న గ్రామ దేవత కోటమాయ్యమ్మ ఆలయం వద్ద కొబ్బరి కాయకొట్టి విశ్వరూప్ ప్రచారం ప్రారంభించారు. గ్రామంలో పర్యటిస్తున్న ఆయనకు అభిమానులు పూలతో స్వాగతం పలికి, మహిళలు హారతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ప్రజలతో మమేకమవుతూ సీఎం జగన పాలనలో జరిగిన మంచిని వారికి వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో దోపిడీ చేసిన జన్మభూమి కమిటీల పరిపాలన కావాలా.. పార్టీలకు అతీతంగా ప్రతీ ఇంటికి సంక్షేమాలు అందించిన జగనన్న ప్రభుత్వం కావాలా నిర్ణయించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రాబోయే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి మళ్లీ జగనన్నను సీఎం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకీ, జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, ఎంపీటీసీ సభ్యురాలు వరసాల వెంకటలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ బడుగు మేరీ శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు దంగేటి దొరబాబు, పార్టీ నాయకులు నరసింగరావు, వెంకన్న, సత్తిబాబు, శ్రీను సచివాలయ కన్వీనర్లు బాలరాజు, 'చిన్నా, సూర్యనారాయణ, దేవేంద్రుడు, మధు, వీరబాబు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పొన్నాడ
- ప్రజల నుంచి అపూర్వ ఆదరణ


చింతలపూడి పాలెంలో ప్రచార రథంపై నుంచి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ, పితాని బాలకృష్ణ తదితరులు

ముమ్మిడివరం: రాష్ట్రంలో మళ్లీ సంక్షేమ పాలన తీసుకురావల్సిన బాధ్యత మనందరిపైన ఉందని అందుకు వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలుపించుకోవాలని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం మండలం చింతలపూడి పాలెం, పళ్లవారి పాలెంలో వైఎస్సార్ సీపీ నాయకులు పితాని బాలకృష్ణతో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. మరోసారి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అడుగడుగునా ప్రజలు హారతిలిచ్చి స్వాగతం పలికారు. ఈసందర్భంగా ప్రజల నుద్దేశించి ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మీకు మంచి జరిగితేనే ఓటు వేయండి అని అడిగే దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎవరు ఎన్ని కూటములు పెట్టుకున్న జగన్ ఒంటరిగానే పోటీ చేస్తారన్నారు. సమాజంలో మహిళలు ఆర్థికంగా సామాజికంగా ఎదగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. టీడీపీ మోసపూరిత వాగ్దానాలను నమ్మవద్దని ప్రలోభాలకు లొంగ కుండా ఎమ్మెల్యేగా తనను ఎంపీగా రాపాక వరప్రసాదరావును గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, ఎంపీపీ కోలా గంగాభవానీ, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, హితకారిణి సమాజం చైర్మన్ కాశి బాలమునికుమారి, కోలా బాబ్జీ, మండల పార్టీ కన్వీర్లు జగతా పద్మనాభం, నల్లా నరసింహమూర్తి, రాయపురెడ్డి జానకీరామయ్య, పోలిశెట్టి ప్రకాష్, పళ్ల వీరబాబు, సానబోయిన మల్లికార్జున రావు, రెడ్డి శివన్నారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని గెలిపించాలి


బండారులంకలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం రూరల్: ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో అమలాపురం నియోజవర్గం వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పినిపే విశ్వరూప్, పార్లమెంట్ నియోజవర్గం అభ్యర్థి రాపాక వరప్రసాద్‌లను గెలిపించాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బండారులంక గ్రామంలో శ్రీరామ్ నగర్, దమ్ముగూడెంలో ప్రాంతాలలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. ఆయన వెంట దండోరా నాయకులు కురుకూరి వీరబాబు, పెదపూడి బాబూరావు, తొత్తరమూడి సుబ్బారావు, కొల్లి వెంకటరమణ, ఈతకోట మణికంత, బాబ్జి, జొన్నాడ గోపి, పెదపూడి ఏడుకొండలు, కొడమంచిలి తాతాజీ, కొల్లి వెంకటేశ్వరరావు, పెదపూడి వెంకటరమణ, నవుండ్రు రమేష్ తదితరు లుఉన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన నాయకుడు


జనసేన నాయకుడిని పార్టీలోకి కండువావేసి ఆహ్వానిస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: ఎస్.యానం గ్రామంలో గతంలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో జనసేన ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేసిన రేవు రవికిషోర్ సోమవారం మంత్రి విశ్వరూప్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. రవికిషోర్ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి అవుతాడని ఆశతో జనసేన పార్టీలో సభ్యత్వం తీసకుని ఇన్నాళ్లుగా కొనసాగానన్నారు. తీరా చూస్తే ఆయన చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. సీఎం జగన్ ప్రభుత్వంలోనే అన్ని కులాలకు మంచి జరిగిందని, గ్రామంలో ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి జగన్ కోసం పనిచేయాలని నిర్ణయించుకుని పార్టీలో చేరుతున్నానన్నారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు జోగి రాజా, ఎంపీటీసీల సమాఖ్య మండల అధ్యక్షుడు పెట్టా అప్పారావు, బడుగు రామచంద్రరావు, లంకే చిరంజీవి, సహదేవుడు, ఎమ్. శ్రీను, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తండ్రిని గెలిపించాలంటూ ప్రచారం


పల్లవారిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న పొన్నాడ తనయులు సత్య సుమంత్, హేమంత్‌లు

ముమ్మిడివరం: వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని కోరుతూ ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ తనయులు సత్య సుమంత్, హేమంత్‌లు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఒక పక్క తండ్రి పొన్నాడ గత 20 రోజులుగా గ్రామాలలోఇంటింటికి తిరుగుతూ సభలు, సమావేశాలు నిర్వహించి ఓటర్లను ఆకర్షించే విధంగా ప్రచారం నిర్వహిస్తుంటే, ఆయన కుమారులు తన తండ్రి గెలిపించాలంటూ ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ ప్రచార పర్వంలో ముందు వరసలో ఉండగా వారి కుమారులు తండ్రి విజయాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారంలో పాల్గొని ఆయన విజయానికి కృషి చేస్తున్నారు. వీరికి తోడుగా వైఎస్సార్ సీపీ నాయకులు వరసాల రమాదేవి, బడుగు శ్రీవాణి, కాశి ఝాన్సీ రాణి, కౌన్సిలర్ కాండ్రేగుల వెంకట సత్యవేణి తదితరులున్నారు.

ఐ బ్యాంక్‌కు కార్నియాలు దానం

తాళ్లరేవు: జార్జీపేట గ్రామానికి చెందిన నందెపు సీతారత్నం సోమవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందడంతో ఆమె కార్నియాలను కుటుంబ సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, సుబ్బారావుల అంగీకారంతో కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు కార్నియాలను అందజేశారు. పి.మల్లవరం గ్రామానికి చెందిన ధూళిపూడి నాగేశ్వరరావు మృతిచెందగా భార్య శేషవేణి, అల్లుళ్లు సతీష్, రవితేజ అంగీకారం మేరకు ఆయన కార్నియాలను ఐ బ్యాంక్ ప్రతినిధి సేకరించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ(బాబి) మాట్లాడుతూ నేత్రదానంపై అవగాహన ప్రతి కుటుంబానికి ఉండాలని ఈ విధంగా నేత్రదానానికి ముందుకు వస్తే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కార్నియల్ అంధత్వంతో ఇబ్బంది పడుతున్న అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్నారు. పెదపాటి కామేశ్వరరావు, గుత్తుల సూర్యనారాయణ, యర్రా చిట్టిస్వామి, నల్లా రాజా, నాగభూషణం తదతరులు పాల్గొన్నారు.

సుబ్బాలమ్మ దేవస్థానంలో ఉగాది ఉత్సవాల ప్రారంభం


అమలాపురం పట్టణలో సుబ్బాలమ్మ అమ్మవారు

అమలాపురం టౌన్: పట్టణ దేవత సుబ్బాలమ్మ దేవస్థానంలో ఉగాది ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈనెల 16వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయని దేవస్థానం ఈవో బి.వీరవెంకటేశ్వరరావు తెలిపారు. ఏటా ఉగాది పర్వదినం సందర్భంగా అమ్మవారి ఉత్సవాలు, తీర్థం వైభవంగా నిర్వహించడం ఆనవాయతీగా వస్తోంది. ఈ ఉత్సవాలు సందర్భంగా అమ్మవారి చిన్న జాగరం, పెద్ద జాగరం, గ్రామోత్సవం, జాతర, తీర్థం, ఏకాహం, అన్నసమారాధన వంటి కార్యక్రమాలు జరుగుతుయి. ఇప్పటికే ఆదివారం రాత్రి అమ్మ సన్నిధిలో చిన్న జాగరం పట్టణానికి చెందిన నూలు కుటుంబీకులకు చెందిన వారు నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం అమ్మవారి పెద్ద జాగరం, అమ్మవారి గ్రామోత్సవం, గరగ నృత్యాలు వైభవంగా జరిగాయి. ఉగాది పర్వ దినమైన మంగళవారం పట్టణ ప్రజలే కాకుండా పరిసర గ్రామ ప్రజలు అమ్మవారిని వేలాది మంది దర్శించుకుంటారు. అమ్మవారి తీర్థం కూడా ఉదయం నుంచి రాత్రి వరకూ జరుగుతుంది. క్రోధి నామ సంవత్సరం తెలుగు సంవత్సరాది (ఉగాది) సందర్భంగా ఉగాది పచ్చడి భక్తులకు పంపిణీ చేస్తారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని తీర్థానికి హాజరయ్యే భక్తులకు మజ్జిగ చలి వేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు ఈవో వీర వెంకటేశ్వరరావు తెలిపారు. ఈనెల 15వ తేదీన అమ్మవారి సన్నిధిలో ఏకాహం జరుగుతుంది. ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం భారీ అన్న సమారాధనతో ఉగాది ఉత్సవాలు ముగుస్తాయని ఈవో వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఉగాది సందర్భంగా అమ్మవారి దేవస్థానాన్ని మామిడి, వేప తోరణాలు, పూల దండలతో అలంకరించారు.

నేడు వీరేశ్వరస్వామి ఆలయంలో పంచాగ పఠనం

ఐ.పోలవరం: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మురమళ్ల భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పంచాగ పఠనం చేస్తున్నట్టు ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఆలయంలో శ్రీ క్రోధి నామ నూతన సంవత్సరం సందర్భంగా దేవదాయ శాఖ ఆదేశాల మేరకు ఆలయ అర్చకులు యనమండ్ర సుబ్బారావు, ఉండి దత్తు , వేద పండితులు గంటి సుబ్రహ్మణ్య శర్మలకు ఉగాది పురస్కారం, ప్రశంసాపత్రం అందజేస్తమన్నారు. అనంతరం యానాంకు చెందిన నాగాభట్ల సుబ్రహ్మణ్యశర్మచే పంచాంగ పఠనం నిర్వహిస్తామన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉగాది పచ్చడి, పంచాంగ వితరణ నిర్వహిస్తామన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లో జరిగే సమావేశాలు, ర్యాలీపై గ్రామ స్థాయి అధికారులు పర్యవేక్షణ చేయాలని తహసీల్దార్ సునీల్‌కుమార్ అన్నారు. ఎంపీడీఓ కృష్ణమోహన్ అధ్యక్షతన అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎన్నికల కోడ్ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నిర్వహించే సమావేశాలు, ర్యాలీలకు రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతులు తప్పనిసరని తెలిపారు. ముందస్తు అనుమతులు లేకుండా సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తే ఎంపీడీఓ, ఫ్లెయింగ్ స్క్వాడ్ అధికారులకు సమాచారం ఇచ్చి, సమావేశాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా కార్యదర్శి, మహిళా పోలీస్, వీఆర్ఓ బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ఎన్‌వీవీ సత్యనారాయణ, కార్యదర్శులు, పాల్గొన్నారు.

సెల్ షాపులో చోరీ

అమలాపురం టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులో చిన్న వంతనల వద్ద ఉన్న క్రియేటీవ్ సెల్ షాపులో చోరీ జరిగింది. రేకుల షెడ్డుగా ఉన్న ఆ షాపు పై కప్పు తొలగించి దొంగలు షాపులోకి ప్రవేశించారు. రిపేరుకు వచ్చిన నాలుగు సెల్‌లను దొంగిలించినట్టు పట్టణ సీఐ కె.క్రిష్టోఫర్ తెలిపారు. ఆదివారం అర్ధ రాత్రి దాటిన తర్వాత ఈ చోరీ జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు షాపు యాజమాని వచ్చి షాపు తెరుచుకునే సరికి చోరీ జరిగినట్లు గుర్తించాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ క్రిష్టోఫర్ తెలిపారు.

ఎన్నికల భద్రతా ఏర్పాట్లపై సమీక్ష

యానాం: ఈనెల 19న జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ ఏర్పాట్లపై యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరిల్లోని ఎస్పీలు, ఎస్సైలతో సోమవారం సీనియర్ సూపరింటెండెంట్ పోలీస్(లా అండ్ ఆర్డర్) నర్రా చైతన్య వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. పోలింగ్ ప్రశాంతంగా, స్వేచ్ఛగా జరిగేలా పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలతో కూడిన బుక్‌లెట్ హ్యాండ్‌బుక్ ఆన్ గైడ్‌లైన్స్ ఫర్ పోలీస్ ఆఫీషియల్స్ లోని అంశాలను వివరించారు. అందరూ మోడల్‌కోడ్ ఆఫ్ కాండాక్ట్‌ను ఉల్లంఘించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

యానాం: పుదుచ్చేరిలో ఈనెల 19న జరుగుతున్న పోలింగ్ విధుల్లో సిబ్బంది అలసత్వం ప్రదర్శించినా, గైర్హాజరైనా చర్యలు తీసుకుంటామని రిటర్నింగ్ అధికారి కులొతుంగన్ పేర్కొన్నారు. సోమవా రం ఆయన మాట్లాడుతూ నాలుగు రీజియన్‌లలో మొత్తం 967 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు.

ముస్లింలకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు


జామియా మసీదులో ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అశోక్, ముస్లింలు

యానాం: రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు సోమవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చారిత్రక జామియా మసీదు, వెంకట్‌నగర్‌లోని మసీదాకూబాలో సైతం జరిగిన ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో కలిసి ఆయన విందులో పాల్గొన్నారు. అంతక ముందు ఎమ్మెల్యేఅశోక్ ను బిస్మిల్లా యూత్ సభ్యులు, ముస్లిం పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మసీదు కమీటీ అధ్యక్షుడు ఎస్‌కేఎం జిలానీ, ఎమ్‌డీ కరీమ్, ఎండీ సుభానీ, ట్రెజరర్ జిలాని, జాయింట్ సెక్రటరీ గౌస్ ముహుద్దీన్, న్యాయవాది తాజుద్దీన్, ఫిరోద్‌మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ

అల్లవరం: ఓడలరేవు ఓఎన్‌జీసీ టెర్మినల్‌లో టాటా కంపెనీలో విధులు నిర్వర్తిస్తూ గుండెపోటుకు గురై మృతి చెందిన కొల్లు బాబులు కుటుంబ సభ్యులను ఎంపీ చింతా అనురాధ సోమవారం పరామర్శించారు. బాబులు చిత్రపటం వద్ద ఎంపీ నివాళులర్పించారు. టాటా కంపెనీ నుంచి మృతుడు కుటుంబానికి రావల్సిన పరిహారాన్ని త్వరగా అందించాలని టాటా కంపెనీ ప్రతినిధులతో ఎంపీ ఫోన్లో మాట్లాడారు.

అన్నదానం

అమలాపురం టౌన్: సినీ హీరో అల్లు అర్జున్ పుట్టన రోజు సందర్భంగా అభిమాన సంఘాల ప్రతినిధులు స్థానిక గీతాశ్రమంలో సోమవారం మధ్యా హ్నం అనాథలకు అన్నదానం నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలోని గోశాల నిర్వహణకు రూ.5,116 విరాళంగా ఆశ్రమ చైర్మన్ ఆకుల బాబికి అభిమాన సంఘం అధ్యక్షుడు వగ్రే శేషు అందజేశారు. ఆ యన ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత జాతీయ ఉపాధ్యక్షుడు యేడిద శ్రీను, అభిమానాలు పాల్గొన్నారు.